క్లుప్తంగా

ఎంఈఓకు ఎమ్మెల్యే పరామర్శ



ఎంఈఓను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి

సోమశిల: అనంతసాగరం ఎంఈఓ–2 ప్రభాకర్‌రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై గాయపడడంతో బుధవారం ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పరామర్శించారు. యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పార్టీ నేతలు మెట్టుకూరు సుబ్బారెడ్డి, డేనియల్, బట్రెడ్డి జనార్దన్‌రెడ్డి, నాగేంద్ర తదితరలు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు ఎమ్మెల్యే పరామర్శ



ఓబులమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి

మర్రిపాడు: మండలంలోని ఏపిలగుంట వైఎస్సార్‌సీపీ నేత రసం రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. రామకృష్ణారెడ్డి తల్లి రసం ఓబులమ్మ ఇటీవల మరణించడంతో బుధవారం ఉత్తరక్రియలు జరిగాయి. సందర్భంగా ఎమ్మెల్యే హాజరై ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

గ్రంధి యానాదిశెట్టికి ఘన నివాళి



యానాదిశెట్టి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎంపీ బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి

కావలి: కావలి మాజీ మున్సిపల్ చైర్మన్ గ్రంధి యానాదిశెట్టి చిత్రపటానికి రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి బుధవారం ఘననివాళులర్పించారు. పట్టణంలోని బృందావనం కాలనీలో యానాదిశెట్టి సంతాపసభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మస్తాన్‌రావు, ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కావలి మున్సిపల్ చైర్మన్‌గా, ప్రజా నాయకుడిగా పట్టణ ప్రజలకు యానాదిశెట్టి అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన



ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సంగం: మండలంలోని దువ్వూరు ప్రాథమిక పాఠశాలలో ఉన్న పోలింగ్ కేంద్రంలో ఆత్మకూరు ఆర్డీఓ మధులత ఓటర్లకు ఈవీఎంలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈవీఎంలో ఓటు వేసే విధానాన్ని వారికి వివరించారు. ఈ సందర్భంగా వారితో ఈవీఎంలో ఓటు వేయించి వారికి పూర్తిగా అవగాహన కల్పించారు. ఎవరూ ఈవీఎంలపై అపోహలు పెట్టుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు నాగరాజు, ఏఎస్ఓ ప్రసాద్, మాజీ జెడ్పీటీసీ దేవసహాయం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముగ్గురమ్మల గ్రామోత్సవం



ముగ్గురమ్మల గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

అల్లూరు: అల్లూరు ఊరు గ్రామదేవతలు గంగమ్మ, కళుగోళమ్మ, పోలేరమ్మ అమ్మవార్ల గ్రామోత్సవాన్ని బుధవారం వేకువ జాము నుంచి వైభవంగా నిర్వహించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ముగ్గురు గ్రామ దేవతలను ప్రత్యేక రథాలపై విశేష పుష్పాలతో అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవార్లు ముఖాలు ఒకరినొకరికి కనపడనీయకుండా పుర వీధుల్లో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. కోలాటాలు, డీజే సౌండ్స్, తీన్‌మార్, కీలుగుర్రాలు, సంప్రదాయ తప్పెట్లు, మంగళవాయిద్యాలతో గ్రామోత్సవం ఆద్యంతం వైభవంగా సాగింది.

జగనన్న మాట ఇస్తే నెరవేరుస్తారు

- అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి
- పింఛన్ల పంపిణీ పెంపు ఉత్సవాల్లో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



అనంతసాగరంలో దివ్యాంగుడికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

మర్రిపాడు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇస్తే కచ్చితంగా నెరవేరుస్తారని, అభాగ్యులకు అందజేస్తున్న సామాజిక పింఛన్ విషయంలో మరోసారి రుజువైందని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. బుధవారం వైఎస్సార్ పింఛను కానుక రూ.3 వేలు పెంపు ఉత్సవాల్లో భాగంగా మర్రిపాడులో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత స్త్రీ విద్య కోసం, వారి అభ్యున్నతి కోసం కృషి చేసిన సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాసంకల్ప పాదయాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన ప్రతి ఒక్క హామీని నెరవేర్చారన్నారు. పింఛను నగదును పెంచుకుంటూ పోతామని చెప్పినట్లుగా జనవరి నుంచి రూ.3 వేలు పింఛన్ అందజేస్తున్నారన్నారు. సామాజిక పింఛన్లు అందుకుంటున్న ప్రతి ఒక్కరికి మరింత ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు. ప్రతి నెల 1వ తేదీ వలంటీర్లు ఇంటికి వచ్చి పింఛన్ అందజేస్తున్న విషయం మీకు తెలుసన్నారు. పింఛన్ నగదుతో పాటు లబ్ధిదారుల సంఖ్య కూడా భారీగా పెరిగిన విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. జిల్లాలో ఈ ఒక్క నెలలోనే 4,408 మందికి కొత్తగా పింఛన్లు మంజూరు కాగా అందులో మర్రిపాడు మండలంలో 84 నూతన పింఛన్లు మంజూరైనట్లు వివరించారు. అర్హతే ప్రామాణికంగా ఇంటి వద్దనే పింఛన్ అందజేసే విధానం దేశంలో మరే రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయలేదని, ఒక్క మన రాష్ట్రంలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా అమలు చేస్తున్న విషయాన్ని తెలుసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమ పాలనను ప్రతిపక్ష పార్టీలు తీవ్ర విమర్శలు చేశారని, ముఖ్యంగా వలంటీర్ల వ్యవస్థపై అర్థం లేని ఆరోపణలెన్నో చేయడంతో పాటు వలంటీర్ల వ్యవస్థను తొలగించాలని పెద్ద కుట్రలే చేశారన్నారు. గత ప్రభుత్వ పాలనకు ప్రస్తుత సంక్షేమ ప్రభుత్వానికి తేడాను ప్రజలే గమనించాలని, రానున్న మూడు నెలల్లో ఎన్నికలు జరుగుతున్నందున ప్రతి ఒక్కరూ తమకు ఏ ప్రభుత్వం సంక్షేమ పాలన అందించిందో ఆలోచించి వారికి మద్దతు తెలపాలన్నారు. మేకపాటి కుటుంబం 40 ఏళ్లుగా నియోజకవర్గంలోనే ఉందని, తన తండ్రి మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి నియోజకవర్గంలో విద్యాభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారన్నారు. డిగ్రీ కళాశాల ఏర్పాటు, జవహర్ నవోదయ విద్యాలయం కోసం సొంత స్థలాన్ని అందజేశారన్నారు. సంక్షేమ ప్రభుత్వం కొనసాగాలంటే మళ్లీ జగనన్న ప్రభుత్వం రావాలని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి వివరించాలని, ప్రచార బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాల్సిన సమయం వచ్చిందన్నారు. మర్రిపాడులో నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నాగమణి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ సిద్ధంరెడ్డి మోహన్‌రెడ్డి, ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, బూత్ కమిటీ మేనేజర్ రేవూరు గోపాల్‌రెడ్డి, మల్లికార్జున రెడ్డి, కృష్ణంరాజు, కొప్పోలు వెంకటేశ్వర్లు, చెవుల శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

జగనన్న పాలలో అన్ని సామాజిక వర్గాల అభివృద్ధి

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

సోమశిల: రాష్ట్రంలో అన్ని సామాజిక వర్గాలను అభివృద్ధి చేసే పథకాలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన కొనసాగుతుందని, అలాంటి సంక్షేమ పాలన మళ్లీ కొనసాగాలంటే ప్రజలందరూ ఆయనను మళ్లీ ఆశీర్వదించాలని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. బుధవారం అనంతసాగరంలో వైఎస్సార్ పింఛన్ కానుక రూ.3 వేలు పెంపు ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి తాను ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రతి ఏడాది పింఛన్ మొత్తాన్ని పెంచి అందజేస్తున్నారన్నారు. 2019లో అనంతసాగరం మండలంలో పింఛన్ల కింద రూ.1.20 కోట్లు ప్రతి నెల అందజేస్తుంటే.. 2024లో రూ.1.90 కోట్లకు పెరిగిందన్నారు. గత ప్రభుత్వ పాలనకు ప్రస్తుత సంక్షేమ పాలనకు ప్రజలే తేడా తెలుసుకున్నారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పం మేరకు 175కు 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయం సాధించే విధంగా ప్రతి ఒక్కరూ కష్టపడాలని సూచించారు. ప్రతిపక్ష పార్టీలకు అనేక ప్రచార సాధనాలు ఉన్నాయని, మనకు సంక్షేమ పథకాలు అందుకుంటున్న ప్రజలే ప్రచార సాధనంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శోభ, ఎంపీపీ సంపూర్ణమ్మ, ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, బొమ్మవరం సర్పంచ్ లక్ష్మీదేవి, జేసీఎస్ కన్వీనర్ అంకిరెడ్డి, శాప్ డైరెక్టర్ కాలువ నరసింహులు, వైస్ ఎంపీపీ పాణెం శ్రీనివాసులు, నాయకుడు బట్రెడ్డి జనార్దన్‌రెడ్డి, పాతాళపల్లి సర్పంచ్ బిజివేముల ఓబులరెడ్డి, మంగుపల్లి ఉపసర్పంచ్ శైలజ తదితరులు పాల్గొన్నారు.



కావలి: పెంచిన పింఛన్ మొత్తాన్ని పేదలకు పంపిణీ చేస్తున్న రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి

దేశంలోనే అత్యధికంగా పింఛన్లు

- సామాజిక పింఛన్ల పంపిణీలో నూతన శకం
- పింఛన్ సొమ్ము పెంపుతో లబ్ధిదారుల్లో సంతోషం
- రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు

కావలి: రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారుడికి అత్యధిక మొత్తంలో సామాజిక పింఛన్లు అందించడం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు అన్నారు. కావలి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో 'వైఎస్సార్ పెన్షన్ కానుక' పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నూతన సంవత్సర కానుకగా ప్రభుత్వం పెంచిన రూ.3 వేల పింఛన్ మొత్తాన్ని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డితో కలిసి బీద మస్తాన్‌రావు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ పింఛన్ మొత్తాన్ని రూ.3 వేలకు పెంచుతామని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని తెలిపారు. అవ్వాతాతల కళ్లల్లో ఆనందమే లక్ష్యంగా దేశంలో ఎక్కడా లేని విధంగా పింఛన్లు అందిస్తున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందని వివరించారు. పింఛన్ సొమ్ము కోసం లబ్ధిదారులు ఎదురుచూడకుండా ప్రతి నెల 1వ తేదీనే పొద్దుపొడవకముందే వలంటీర్లతో లబ్ధిదారుల ఇళ్ల వద్దనే అందిస్తున్న ఘనత కూడా ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రానికి సమర్థవంతమైన పాలన అందిస్తున్నారని వివరించారు.

కావలికి రూ.2,500 కోట్లు

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్ల కాలంలో కావలి నియోజకవర్గానికి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల కోసం రూ.2,500 కోట్లు ప్రభుత్వం వెచ్చించినట్లు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అమ్మ ఒడి, పింఛన్లు, చేయూత, రైతు భరోసా, సచివాలయాల నిర్మాణం, నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, సచివాలయాల నిర్మాణం, తదితర పథకాల పేరుతో మునుపెన్నడూ లేని విధంగా నియోజకవర్గంలోని పేదలకు రూ.2,500 కోట్లు కేటాయించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఏ సచివాలయాలనికి ఎంత కేటాయించింది కూడా సచివాలయాల వద్ద బోర్డులు పెట్టి పారదర్శకతకు పెద్దపీట వేసినట్లు వివరించారు. మేనిఫెస్టోలో చెప్పిన విధంగా పేదల పింఛన్ మొత్తాన్ని రూ.3 వేలకు పెంచడం ద్వారా కొత్త సంవత్సరంలో అవ్వాతాతల కళ్లలో ఆనందం కనిపిస్తుందన్నారు. వృద్ధాప్యంలో ఇబ్బందులు పడకుండా ప్రతి నెలా రూ.3 వేల పింఛన్ సొమ్మును ఇంటి వద్దనే అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి సంపూర్ణ ఆరోగ్య భద్రత

- జగన్న ఆరోగ్య సురక్షతో గ్రామాల్లోనే కార్పొరేట్ వైద్యం
- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి

కావలి: రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి సంపూర్ణ ఆరోగ్య భద్రత కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 3, 4, 5వ వార్డులకు సంబంధించి 5వ వార్డులో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా పేదల ఆరోగ్యానికి భద్రత కల్పించాలని, సంపూర్ణ ఆరోగ్యంతో అందరూ సంతోషంగా ఉండాలనే సంకల్పంతో కార్పొరేట్ వైద్యం అందించే లక్ష్యంతో ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు నేరుగా గ్రామాలకే వచ్చి వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. వైద్యశిబిరాల ద్వారా వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి మెరుగైన వైద్యవ అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అమలు చేస్తున్న ఆరోగ్య సురక్షకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తుందని తెలిపారు. సాధారణ వైద్యపరీక్షలతో పాటు కంటి వైద్యపరీక్షలు కూడా నిర్వహించి అవసరమైన వారికి అద్దాలు కూడా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఆపరేషన్లు అవసరమైన వారికి పూర్తి ఉచితంగా ఆపరేషన్లు చేస్తున్నట్లు వివరించారు. కంటి అద్దాలు అవసరమైన వారికి దృష్టిలోపాన్ని బట్టి నెలరోజుల్లోగా అద్దాలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం అన్నీ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పేద వాళ్లు కూడా ధనవంతులతో సమానంగా కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందేలా ఆరోగ్యశ్రీ ప్రారంభించిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి దక్కితే, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్పొరేట్ వైద్యాన్ని కూడా నేరుగా పల్లె ముంగిటకే తీసుకు వచ్చారని తెలిపారు. కార్యక్రమంలో వైద్యారోగ్యశాఖ సిబ్బంది, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పేదింటి పెద్ద కొడుకు సీఎం జగన్



జగనన్న భూరక్ష, శాశ్వత భూహక్కు పట్టాదారు పాస్‌పుస్తకం అందిస్తున్న రాజారెడ్డి

- సామాజిక పింఛన్ల పంపిణీలో మేకపాటి రాజారెడ్డి

సీతారామపురం(ఉదయగిరి): సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ములకు సామాజిక పింఛన్‌కు రూ.3 వేలకు పెంచి పేదింటి పెద్దకొడుకుగా ప్రజల గుండెల్లో చిరకాల ముద్ర వేసుకున్నారని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. సీతారామపురం ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం జరిగిన పెన్షన్ల పెంపు, నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఒక్క సీతారామపురం మండలంలో 3,439 మంది ప్రతి నెలా రూ.150 కోట్లు అందజేస్తుందన్నారు. మలిసంధ్యలో ఎలాంటి ఆధారం లేని అవ్వాతాతలకు ఈ పింఛను ఆసరాగా నిలుస్తోందన్నారు. చంద్రబాబు హయాంలో ఒక కొత్త పెన్షన్ ఇవ్వాలంటే అప్పటి దాకా పెన్షన్ తీసుకుంటున్న మరో వ్యక్తి చనిపోయేంత వరకు వేచి చూడాల్సిన పరిస్థితి అన్నారు. కానీ ప్రస్తుత జగన్ పాలనలో అర్హతే ప్రామాణికంగా, పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరికీ పింఛను ఇస్తున్నారని గుర్తు చేశారు. చంద్రబాబు అధికారం దిగిపోయే నాటికి రాష్ట్రంలో 39 లక్షల పెన్షన్లు ఉండగా ప్రస్తుతం అవి 66 లక్షలకు పైగా చేరుకున్నాయన్నారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్, సచివాలయం వలంటీర్ వ్యవస్థ అమ్మ ఒడి, డ్వాక్రా రుణమాఫీ, చేయూత, రైతుభరోసా తదితర పథకాల ద్వారా ప్రజలు ప్రత్యక్షంగా లబ్ధిపొందుతున్నారన్నారు. ఇరవై ఏళ్లు దాటిన అసైన్‌మెంట్ భూములకు పూర్తి హక్కులు కల్పించడంతో పాటు బినామీ భూములు, చుక్కల భూముల సమస్యలు సీఎం జగన్ ప్రభుత్వంలోనే పరిష్కారమయ్యాయన్నారు. ప్రజాశ్రేయస్సు కోసం నిరంతరం తపించే జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మేకపాటి అన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు రకరకాల వాగ్దానాలతో ప్రజల ముంగిటకు వస్తారని, అవన్నీ నమ్మవద్దన్నారు. అనంతరం కొత్తగా మంజూరైన పలువురికి పింఛన్లు అందజేశారు. జగనన్న భూరక్ష, శాశ్వత భూహక్కు పట్టాలు కూడా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు చింతంరెడ్డి సుబ్బారెడ్డి, మాజీ జెడ్పీటీసీ దుగ్గిరెడ్డి గురవారెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పీసీ అల్లూరురాజు, ఎలీషా, మాబయ్య, దుగ్గయ్య, నేలటూరి అబ్రహాం, తహసీల్దార్ సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందరికి చేరువయ్యేలా చూడాలి

చేజర్ల: కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన పేద ప్రజలందరికీ అందేలా చూడాలని నాయకులు కోరారు. బుధవారం చేజర్ల, బోడిపాడు గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. నాయకులు, అధికారులు మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ ద్వారా పేదలకు వైద్య సేవలు, పీఎం ఆవాస్ యోజన, అటల్ పెన్షన్ యోజన, వడ్డీ లేని రుణాలను వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు, అధికారులు పాల్గొన్నారు.

వంట గ్యాస్ లీక్‌తో కలకలం

అనుమసముద్రంపేట: వంట చేస్తున్న సమయంలో వంట గ్యాస్ లీక్ కావడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి స్థానికంగా కలకలం సృష్టించింది. ఈ ఘటన ఏఎస్‌పేట దర్గా సమీపంలో బుధవారం జరిగింది. దర్గా సమీపంలో ఓ కుటుంబం అద్దెకు ఉంటుంది. మధ్యాహ్న సమయంలో వంట చేస్తుండగా గ్యాస్ సిలిండర్ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో ఆ కుటుంబం బయటకు పరుగెత్తడంతో స్థానికులు అప్రమత్తమై మంటలను అదుపులోకి తెచ్చారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. అయితే ఇంట్లో ఎటువంటి నష్టం వాటిల్లేదని బాధితులు తెలిపారు.

8న అంబేడ్కర్ విగ్రహాలకు ప్రత్యేకాలంకరణ



మహిమలూరులో అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షిస్తున్న ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్

ఆత్మకూరు రూరల్: ఈ నెల 19న విజయవాడ స్వరాజ్ మైదానంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహావిష్కరణకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్న నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న అంబేడ్కర్ విగ్రహాలను ప్రత్యేకాలంకరణ చేసి రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేయాలని ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ తెలిపారు. మండలంలోని మహిమలూరు, రామస్వామిపల్లి, చెర్లోయడవల్లి సచివాలయాలను బుధవారం ఆయన సందర్శించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 9న ప్రతి పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయాలన్నారు. 10న రక్తదాన శిబిరాల నిర్వహణ, 12న ముఖ్యమైన కూడళ్లలో మానవహారం నిర్వహించాలన్నారు. 19న విజయవాడలో జరిగే అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణకు ప్రతి సచివాయం నుంచి ఐదుగురు వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మహిమలూరు సర్పంచ్ పట్టెడ చంద్రశేఖర్, వీఆర్వో సూరిపోగు కృష్ణయ్య, పంచాయతీ కార్యదర్శి పల్లవోలు భాస్కర్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ



ఆత్మకూరు: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ డైరీ, నూతన క్యాలెండర్లను ఎంఈఓ షేక్ నజీర్ బాషా బుధవారం ఆవిష్కరించారు. ఏపీటీఎఫ్ మండల, జిల్లా, రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఎంఈఓ కార్యాలయానికి చేరుకుని తొలుత ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ కార్యవర్గ సభ్యులు జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ ఆర్ వెంకటేశ్వర్లురెడ్డి, కమిటీ సభ్యులు రామసుబ్బారెడ్డి, మల్లికార్జునరెడ్డి, మండల అధ్యక్ష కార్యదర్శులు శివరామిరెడ్డి, సురేష్, శివరాం పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిబాయిపూలే జయంతి



ఆత్మకూరు: జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయిపూలే జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం



వెన్నవాడలో ఉపాధ్యాయిని జీవనిని సత్కరిస్తున్న పేరెంట్స్ కమిటీ సభ్యులు, విద్యార్థులు



అనుమసముద్రంపేట: ఉపాధ్యాయినులను సత్కరించిన ఉపాధ్యాయులు



సంగం: ఉపాధ్యాయిలను సన్మానిస్తున్న దృశ్యం



కావలి: ఉపాధ్యాయినులను సన్మానిస్తున్న విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు

ఆత్మకూరు: ప్రముఖ సామాజిక కార్యకర్త, మహిళల విద్యకు పునాది వేసిన సావిత్రిబాయిపూలే 193వ జయంతిని పట్టణంలోని పలు పాఠశాలల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆత్మకూరు మున్సిపల్ కౌన్సిలర్ బల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ సావిత్రిబాయిపూలే సామాజిక చైతన్య సేవలను వివరించారు. తొలి మహిళా ఉపాధ్యాయినిగా మహిళల చదువుల కోసం ఆమె చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రత్నం, శ్రీనివాసులు, జనార్దన్, ఇందిరమ్మ, డీ పద్మమ్మ, భారతి, కల్పన రహీమా, నందిని, ప్రసన్న తదితరుల పాల్గొన్నారు.

- ఏసీఎస్ఆర్ కాలనీ ఎంపీపీ పాఠశాలలో సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కోలా సుజాత, జ్యోతి వెంగమ్మ, విశ్రాంత ఉపాధ్యాయుడు సాధిక్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.
- ఆది ఆంధ్ర పాఠశాలలో సావిత్రిబాయిపూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయురాలు మాలకొండమ్మను విద్యార్థిని విద్యార్థులను హెచ్ఎం నాగేంద్రతో కలిసి సన్మానించారు. పూలే దంపతుల జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు.

ఆత్మకూరు రూరల్‌లో..

ఆత్మకూరు రూరల్: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో సావిత్రిబాయిపూలే 193 జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కరటంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల, వెన్నవాడ ఎంపీపీఎస్ పాఠశాలలో సావిత్రిబాయిపూలే చిత్రపటాలకు విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెన్నవాడ పాఠశాల ఉపాధ్యాయిని జీవనిని పేరెంట్స్ కమిటీ సభ్యులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ప్రధానోపాధ్యాయుడు రవీంద్రకుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఏఎస్‌పేటలో..

అనుమసముద్రంపేట: మండలంలోని కావలియడవల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు ఓ వెంకటేశ్వరరావు సావిత్రిభాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయినులు మాధవి, రాధ, అనితను పూలమాలలు, శాలువాలతో సత్కరించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సంగంలో..

సంగం: మండలంలోని తరుణవాయి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఉడ్‌హౌస్‌పేట ప్రాథమిక పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు. ఎంఈఓలు జానకీరాం, మల్లయ్య ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి శైలజ, స్థానికులు పాల్గొన్నారు.

కావలిలో..

కావలి: సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను బుధవారం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎంఈఓలు గోవిందయ్య, వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం సీనియర్ ఉపాధ్యాయిలను ఘనంగా సత్కరించారు. భారత తొలి ఉపాధ్యాయినిగా మహిళల విద్యావికాసానికి ఆమె అందించిన సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు సుదర్శనం, వెంకటేశ్వర్లు, రఘు, మధు, రఘునాథ్‌రెడ్డి, వేణుగోపాల్, ముజీబ్, తదితరులు పాల్గొన్నారు.